# 42

# తలకాచిన అంకెలు

సుల్తాన్ అలీషా బీజాపూర్ రాజ్యాన్ని పరిపాలిస్తుండేవాడు.

ఆయనకి పరమత ద్వేషం లేదు. తన రాజ్యంలో ఉన్న హిందువులనూ, మహమ్మదీయులనూ రెండు కళ్ళుగా చూసుకునేవాడు. కుల, మత ప్రసక్తి లేకుండా తన ఆస్థానంలో ప్రతిభగల పండితుల్ని, విద్వాంసుల్ని నియమించాడు.

ఆస్థాన పండితులు ఎందరున్నా పాండిత్యంతోపాటు మేధోసంపత్తి అసమానంగా ఉన్న కారణాన హరిహరనాథునికి అత్యంత గౌరవం ఇస్తుండేవాడు. ఇతర మంత్రులున్నా- ముఖ్యమైన విషయాలలో ఆయన సలహాను తప్పక తీసుకుంటుండేవాడు. ఇది మంత్రులకు కన్నెర్ర అయింది.

◦ ◦ ◦

క్రిక్కిరిసిన సభికులతో, గొప్ప గొప్ప పండితులతో సభాప్రాంగణం కనువిందు గొలుపుతోంది. నవాబు అలీషా లేచి, "ఈ అనంత విశ్వంలో ఎన్ని నక్షత్రాలున్నాయి? సమాధానం సరిగ్గా చెప్పిన వారిని ఘనంగా సన్మానిస్తాం. చెప్పగలమని ముందుకు వచ్చి చెప్పలేకపోయినా, తప్పు చెప్పినా శిరచ్ఛేదం తప్పదు" అని ప్రకటించాడు.

ఈ ప్రకటన విని సభికులు విస్తుపోయారు.

ఎవరూ నోరు మెదపలేదు. పండితులు కూడా మౌనంగా ఉండిపోయారు.

"ఏమీ... ఇంతకీ మహాసభలో సమాధానం చెప్పగలవారే లేరా?" అని ఆశ్చర్యపోయాడు సుల్తాన్.

మహమ్మదీయ పండితుడు ఒకడు లేచి, "ప్రభూ? ఇది సామాన్యులు చెప్పగల సమాధానం కాదు. కేవలం ఒక్క హరిహరులవారు మాత్రమే చెప్పగలరు. ఇంతటి మహా విశ్వాన్ని వారు యోగదృష్టితో చూసి తారకల్ని లెక్కించి చెప్పగలరు" అన్నాడు.



మిగిలిన వారు "అవునవును" అంటూ వత్తాసు పలికారు.

ఇందులో ఏదో కుట్ర ఉందని గ్రహించాడు హరిహరనాథుడు. "ప్రభూ! ప్రభువుల ఆదరణ, సహచరుల శుభాకాంక్షలు ఉన్నపుడు తమ ఆజ్ఞను శిరసావహిస్తాను. అయితే... ఇది చాలా క్లిష్టమైన ప్రశ్న కనుక రెండు రోజులు గడువీయండి. ఈలోగా దీక్షతో సరస్వతీ దేవిని ప్రార్థించి, యోగదృష్టితో పరికించి, నక్షత్రాల సంఖ్యను లెక్కించి, ఎల్లుండి ఇదే సమయానికి చెప్తాను" అన్నాడు.

సభ ముగిసింది.

ఆరోజు గడిచింది. మరునాడు సాయంత్రం అయింది.

మాట ఇచ్చాడే కాని, ఏ విధంగా సమాధానం చెప్పాలో హరిహరనాథునికి కూడా పాలుపోలేదు. నిత్యమూ సరస్వతీదేవిని మనసులోనే ప్రార్థించసాగాడు.

ఆ సాయంత్రం మనసు చికాకుగా వుండి నదీతీరానికి వాహ్యాళికి వెళ్లాడు హరిహరనాథుడు.

అక్కడ ఏటి ఒడ్డున కొందరు పిల్లలు ఆడుకొంటున్నారు.

ఒక బాలుడు దోసిలి నిండా ఇసుక పోసుకున్నాడు. తోటి వారి వంక దాన్ని చూపిస్తూ- "ఇందులో ఎన్ని ఇసుక రేణువులున్నాయి చెప్పండి?" అని అడిగాడు.

అందరూ "మాకు తెలీదు" అన్నారు.

"ఇందులో రెండు కోట్ల, నలభై నాలుగు లక్షల, మూడువేల, ఆరు వందల, ముప్పయి ఒక్క రేణువులు ఉన్నాయి" అన్నాడు.

వాళ్ళు "అది నిజమో కాదో మాకేం తెలుసు? నువ్వు తప్పు చెప్తున్నావేమో..?!" అన్నారు.

"నమ్మకం లేకపోతే మీరు లెక్కపెట్టి చూసుకోండి. లేదా- నేను చెప్పింది నిజం అని నమ్మండి" అన్నాడు మొదటివాడు.

అది చూడగానే హరిహరనాథుని మదిలో ఒక ఆలోచన మెదిలింది.

మూడవ రోజున సభ ప్రారంభమయింది.

నవాబుతోపాటు అందరూ హరిహరనాథుడు చెప్పే సమాధానం కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

నవాబ్ "హరిహరవర్యా! మీరు సమస్యకు పరిష్కారం కనుగొన్నారా?" అని అడిగాడు.

"చిత్తం ప్రభూ! తమ ఆశీస్సులతో సరస్వతీదేవి అనుగ్రహంతో యోగదృష్టి ద్వారా చూసి తారకలను లెక్కించగలిగాను. అవి తూర్పున- 80 లక్షల కోట్ల, అరవైలక్షల ఇరవై నాలుగు వేల నాలుగు వందల ముప్పది ఆరు. పశ్చిమాన- 91 లక్షల కోట్ల, ఎనభై లక్షల ఇరువై నాలుగు వేల నాలుగు వందల ఎనభై రెండు, దక్షిణాన- 15 లక్షల కోట్ల, అరవై ఆరు లక్షల తొంభై రెండు వేల నూట పదహారు, ఉత్తరాన- 98 లక్షల కోట్ల, డెబ్బది ఎనిమిది లక్షల అరవై ఏడు వేల ఎనిమిది వందల నలభై ఏడు, నడినెత్తిన- 150 లక్షల కోట్ల, పదహారు లక్షల అరవైవేల ఏడు వందల పదకొండు ఉన్నాయి. మన మామూలు కంటికి కనిపించనివి కోటాను కోట్లు ఉన్నాయి. కావలిస్తే సభలోని ఉన్న మహాపండితుల చేత తిరిగి లెక్కించి సరిచూడవచ్చు" అన్నాడు హరిహరనాథుడు వారి వంక చూస్తూ.

సభ హర్షధ్వానాలతో మారుమోగిపోయింది.

హరిహరనాథుని వంటి మహామేధావి చెప్పిన సంఖ్యని సవాలు చేసే ధైర్యం ఎవరికీ లేకపోయింది. ఏమీ అనలేక తలదించుకున్నారు మహమ్మదీయ పండితులూ, మంత్రులూ.

అన్నమాట ప్రకారం హరిహరనాథుని ఘనంగా సన్మానించారు నవాబ్ ఆలీషా.

★★★